క్లుప్తంగా

ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్‌కు సత్కారం



తాడేపల్లిరూరల్ : శాసనమండలి సభ్యులు, అసోసియేషన్ చీఫ్ పాట్రన్ మొండితోక అరుణ్ కుమార్‌ను శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం నాయకులు తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లను సమీక్షించేందుకు ఐఏఎస్ అధికారుల కమిటీని నియమించడంలో ప్రధాన భూమిక పోషించారని తెలిపారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్‌కు తమ సమస్యలను విన్నవించామన్నారు. అరుణ్‌కుమార్ ఎంతో చొరవ చూపి యుద్ధ ప్రాతిపదికన ఐఏఎస్‌ల కమిటీ ఏర్పాటుకు కృషి చేశారని, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల పట్ల ఎంతో నిబద్ధతతో ఉంటూ వారి సంక్షేమం కోసం పాటుపడిన ఆయనను ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల తరుపున ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ సత్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సీహెచ్ ఆనంద్, క్యాపిటల్ రీజియన్ ప్రెసిడెంట్ వై.వి. సుధాకర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎం.రాఘవులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాతే వైద్య రంగంలో పెనుమార్పులు
- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త గంజి చిరంజీవి
- బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పెరుకలపూడిలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త గంజి చిరంజీవి

తాడేపల్లిరూరల్: పేదలను ఆదుకోవడమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. శనివారం దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల, పెరికలపూడి, రేవేంద్రపాడు గ్రామాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, ఇతరనాయకులతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త గంజి చిరంజీవి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పెత్తందార్లకు పేదలకు మధ్య యుద్ధం జరుగుతోందని, ఆ యుద్ధంలో పెత్తందార్లను తరిమి కొట్టేందుకు పేదప్రజలందరు ఏకమై సిద్ధంగా ఉండాలని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా భావించి పని చేస్తున్నారని, విపక్షంలో ఉన్నవారు వాటిని తప్పుపడుతూ విష ప్రచారం చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో చూపించారని, ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా గత 40 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను, వలంటీర్లను విమర్శించిన టీడీపీ నేతలు నేడు ఆ వ్యవస్థను మేమే ప్రవేశపెట్టామంటూ ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. టీడీపీ 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్నా మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో 9 వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారని, ఎన్నో ప్రభుత్వ భవనాలను నిర్మించారని, ఈ అభివృద్ధి విపక్షంలో ఉన్న వారికి కనిపించకపోవడం బాధాకరమన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి ఎందరో పేదల ప్రాణాలను కాపాడారన్నారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్య శ్రీ సేవలను మరింత విస్తృత పరిచారన్నారు. అనంతరం పలువురు బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. దుగ్గిల సర్పంచ్ కుషీభాయి, పెరికలపూడి సర్పంచ్ గంపల గంగాధర్, రేవేంద్రపాడు సర్పంచ్ పలుకూరి మేరిరాణి, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శృంగారపాటి రత్నం, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో చలపతి కళాశాల విద్యార్థులు



చిన్నారులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న చలపతి విద్యార్థులు

తాడికొండ: సమాజసేవకు మేము సైతం అంటూ కదిలారు మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు. సీఎస్ఈ, సీఎస్ విభాగంలో సైబర్ బ్లూమ్స్ అసోసియేషన్‌కు చెందిన పలువురు విద్యార్థులు సమాజ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళగిరి మండలం ఆత్మకూరులోని చిన్నారుల అనాథాశ్రమంలో సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులతో సమాజ సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహించేలా ముందుకు నడిపిస్తున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, సీఎస్ఈ, సీఎస్ విభాగాధిపతులు డాక్టర్ డి.కళ్యాణ్ కుమార్, వి.ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూకు విన్నర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డీన్ డాక్టర్ వి.రాజేష్

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో విన్నర్ అవార్డు లభించినట్లు వర్శిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ తెలిపారు. శనివారం వర్శిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ యూనివర్శిటీకి పచ్చదనం కలిగిక క్యాంపస్, సోలార్ విద్యుత్‌ను ఉపయోగిస్తున్నందుకు గాను జాతీయ స్థాయిలో అవార్డు లభించిందని, స్కిల్ డైవర్శిటీ అవుట్ రీచ్ అనే కేటగిరి కింద ఈ అవార్డును ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కోల్ కతా వారు కేంద్ర ప్రభుత్వ శాఖ మినిస్ట్రి ఆఫ్ న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ సహకారంతో నాలెడ్జ్ పార్టనర్ డెలాయిట్ నిర్వహించిన 4వ గ్రీన్ ఉర్జా, ఎనర్జీ ఎఫిషియెన్సీ అవార్డ్సులో ప్రతిష్టాత్మక అకాడెమియా ఎక్సలెన్స్ అవార్డును అందజేసినట్లు తెలిపారు. న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో ఈ నెల 16న జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో ఇంధనసామర్థ్యం, పునరుత్పాదక ఇంధనం సంబంధిత రంగాలను అభివృద్ధి చేయడంలో అసాధారణమైన సహకారం అందించినందుకు కేఎల్‌యూ ప్రశంసలు అందుకుందని వివరించారు. మాజీ కేంద్ర కార్యదర్శి అనిల్ అర్జాన్, మంత్రిత్వ శాఖ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ డైరెక్టర్ సుమన్ చంద్ర, మాజీ కేంద్ర కార్యదర్శి అలోక్ కుమార్ చేతుల మీదుగా యూనివర్శిటీ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ వి.రాజేష్ అవార్డును అందుకున్నారని తెలిపారు. ఈ అవార్డు తమ యూనివర్శిటీకి రావడం వెనుక వడ్డేశ్వరం గ్రీన్‌ఫీల్డ్ క్యాంపస్‌లోని విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సమష్టి కృషి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అసోసియేట్ డీన్లు డి.శేషిరెడ్డి, కె.జె. బ్రహ్మచారి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: శుభ్రత పాటించడం ద్వారా డెంగీ వ్యాధి సోకకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని జిల్లా మలేరియా అధికారి టి.సుబ్బరాయణం అన్నారు. మండలంలోని అమీనాబాద్, కండ్రిక గ్రామాల్లో డెంగీ కేసులు నమోదు కావడంతో వారి ఇళ్లవద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. డెంగీ వచ్చి గుంటూరులో చికిత్సపొంది వచ్చినవారిని పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసు నమోదు అయిన వారి ఇంటికి చుట్టుపక్కల 50 ఇళ్ల వద్ద ఉన్న వ్యక్తుల ఆరోగ్య సమాచారాన్ని సేకరించామన్నారు. అవసరమైన వారికి రక్తపూత పరీక్షలు చేసినట్లు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా యాంటీలార్వా ఆపరేషన్ (ఏఎల్ఓ) నిర్వహించామని, చుట్టుపక్కల ఇండోర్‌స్ప్రే డ్రైవ్ చేయించినట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట ఏఎంఓ రాజునాయక్, సత్తెనపల్లి మలేరియా సబ్‌యూనిట్ అధికారి చంద్రశేఖర్, హెచ్ఎస్ కె.సుదర్శనరాజు, ఎంపీహెచ్ఏ బాబురావు ఉన్నారు.



29న భావనారుషి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

మంగళగిరి: పట్టణంలోని నాంచారమ్మ చెరువులో నూతనంగా నిర్మించిన భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్లతో పాటు గణపతి, లక్ష్మీదేవి, సరస్వతి అమ్మవార్ల దివ్య విగ్రహ ప్రతిష్టామహోత్సవం ఈనెల 29వ తేదీన వైభవంగా నిర్వహించనున్నట్లు పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధులు తెలిపారు. శనివారం కార్యాలయంలో మహోత్సవ ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. సంఘం ప్రతినిధులు చింతక్రింది కనకయ్య, దామర్ల కుబేరస్వామి, గంజి రవీంద్రనాథ్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ



తాడేపల్లిరూరల్: ఎయిడ్స్ మహమ్మారిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేఎల్‌యూ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చక్రవర్తి అన్నారు. శనివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వడ్డేశ్వరంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుప్రియ మాట్లాడుతూ వడ్డేశ్వరం గ్రామంలోని ప్రధాన కూడలిలో విద్యార్థులు మానవహారం నిర్వహించారన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను, సమన్వయకర్తలుగా వ్యవహరించిన పి.సురేష్, చంద్రశేఖర్‌లను వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు అభినందించారు.

20న వలంటీర్లకు వందనం

తాడికొండ: ఈ నెల 20వ తేదీన తాడికొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి మేకతోటి సుచరిత హాజరు కానున్నారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె తెలిపారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషిచేయాలి

మంగళగిరి: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీకే ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, వైద్యుడు అశోక్ అన్నారు. పట్టణంలోని సీకే ఉన్నత పాఠశాల 16వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. సమాజంలో విద్య ఒక్కటే పేదరికాన్ని నిర్మూలించడంతో పాలు సమసమాజ స్థాపనకు దోహదం చేస్తున్నారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జంజనం పాండురంగారావు, బాలికల ఉన్నత పాఠశాల అధ్యక్షుడు చింతక్రింది కళ్యాణ కుమార్, కరస్పాండెంట్ వింజమూరి వినయ్ కుమార్, డిగ్రీ కళాశాల డీన్ దామర్ల వెంకటనరసింహరావు, ప్రిన్సిపాల్ ఎ.రత్నబాబు, హెచ్ఎం ఎ.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం, యర్రబాలెం పారిశ్రామిక వాడలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు కోసం జరుగుతున్న విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్‌లో ఉచిత శిక్షణ

మంగళగిరి: మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఐబీఎస్ ప్రెస్‌క్లబ్ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి జిల్లాలో విద్యార్థులకు సాఫ్ట్‌వేర్‌లో ఉచితశిక్షణ ఇవ్వనున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 70935 29750 నంబరులో సంప్రదించాలని కోరారు. రవికుమార్, ఆదినారాయణ, రమేష్, శ్రీనివాస్, కోటేశ్వరరావు, భాను ప్రదీప్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పర్యటించిన నారా బ్రాహ్మణి



మంగళగిరి: మంగళగిరి చేనేత కార్మికులను అన్నివిధాల ఆదుకుంటామని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి తెలిపారు. శనివారం బ్రాహ్మిణి నగరంలో పర్యటించి చేనేత పరిశ్రమ వివరాలను తెలుసుకున్నారు. ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన వీవర్‌శాలను బ్రాహ్మణి , టాటా తనేరా సీఈఓ అంబుజ నారాయణలు ప్రారంభించారు. టాటా గ్రూపు ప్రతినిధులు రమణారెడ్డి, శాలిని, పాల్ పాల్గొన్నారు.

కృష్ణానదిలో మునిగి వ్యక్తి మృతి

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని కృష్ణానది ఎగువ ప్రాంతంలో ఉండవల్లి కరకట్ట వెంబడి కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వద్ద యువకుడు నీటిలో మునిగి మృతిచెందాడు. సీఐ మధుసూధన రావు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన కుంచెం లోకేష్ రావు (27) ఓ ఇన్సూరెన్సు కంపెనీలో పనిచేస్తుంటాడు. శనివారం భార్య కమలకుమారి, ఇద్దరు పిల్లలతో కలిసి సరదాగా ఈతకు కృష్ణానదిలో దిగారు. లోకేష్‌రావు నీటిలో మునిగిపోవడంతో భార్య, పిల్లలు పెద్దగా కేకలు వేశారు. చుట్టుపక్కలవారు మునిగిపోయిన లోకేష్‌ను నీటిలో నుంచి బయటకు తీయగా, అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. ఘటనపై భార్య కమలకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదనరావు తెలిపారు.

